'నిబంధనలకు లోబడే న్యూ ఇయర్ వేడుకలు'

మధురవాడ: నిబంధనలకు లోబడే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని పీఎం పాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ చెప్పారు. పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు 70 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీరిలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో నలుగురితో మొబైల్ టీమ్, రెండు బ్లూ కోట్స్ బృందాలు గస్తీ తిరుగుతాయన్నారు. ఆదివారం కూడా ప్రత్యేక బృందాలు విధులు నిర్వహిస్తాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వారి కోసం ప్రత్యేక చెక్ పోస్టులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయనతోపాటు సబ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరావు, విశ్వనాథం ఉన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను సీఐ రామకృష్ణ శనివారం పర్యవేక్షించారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.3 లక్షల విరాళాలు

సింహాచలం: అప్పన్న శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఎన్‌ఏడీ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన కె.సంతోష్ లక్ష రూపాయలను చెక్కు రూపంలో సింహగిరిపై మే ఐ హెల్ప్‌యూ కేంద్రంలో ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కె.సత్యదేవ్ అనే దాత లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో ఏఈవో శ్రీనివాసరావుకు అందించారు. ఒడిశాలోని బరంపురానికి చెందిన బి.జగ్గారెడ్డి లక్ష 1,116 రూపాయల విరాళాన్ని అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం పీఆర్వోలు సునీల్, నాయుడు పాల్గొన్నారు.

ప్రయోగశాలల అభివృద్ధికి కృషి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆచార్యులు ప్రయోగశాలలను స్థాపించి, అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఆధునికీకరించిన సాఫ్ట్‌వేర్ లేబొరేటరీని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆచార్యులతో భేటీ అయ్యారు. కంప్యూటర్ రంగంలో పరిశోధనలు జరిపేలా విభాగంలో కొన్ని పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు



సాయినాథునికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డీ సాయినాథ సహిత దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన వేడుకలు ఆఖరి రోజు సాయినాథునికి పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, కాకడ హారతి జరిపించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, దుక్క వరం తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస సర్వీస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడకు చెందిన చీడి బంగారమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ ఎం.సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం... తాపీమేస్త్రి బోయి అచ్చిబాబుతో బంగారమ్మ ద్విచక్ర వాహనంపై భవన నిర్మాణ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం గట్టిగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన బంగారమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సన్నిధిలో ఫిష్ వెంకట్



శ్రీవారి సన్నిధిలో నటుడు ఫిష్ వెంకట్

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నటుడు ఫిష్ వెంకట్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



వంక పైడిరాజు (ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన వంక పైడిరాజు అనే టైల్స్ కాంట్రాక్టర్ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని భార్య జ్యోతి భీమిలి పోలీసులకు అందించిన ఫిర్యాదు ప్రకారం... డిసెంబర్ 29న రాత్రి ఇద్దరు పిల్లలు, పైడిరాజు, జ్యోతి ఇంట్లో నిద్రించారు. 30న ఉదయం 6 గంటలకు జ్యోతి నిద్రలేచి చూడగా భర్త కనిపించలేదు. చుట్టుపక్కల ఇళ్లు, బంధువుల ఇళ్లలో గాలించినా అతని ఆచూకీ లభించకపోవడంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం పంచుతున్న ప్రదీప్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సూచనలతో వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, ఇతర సరకులు శనివారం పంచిపెట్టారు. ఇక్కడ విశాఖ పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు తాతపూడి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో 20 మందికి బియ్యం, దుస్తులు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫాస్టర్ సాల్మన్‌రాజు, గ్లోరీ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్

నియోజకవర్గంలో సందడిగా వేడుకలు



స్వీట్స్ షాపులో వినియోగదారుల రద్దీ

తగరపువలస: చిట్టివలస, తగరపువలస కార్మికవాడ, భీమిలి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి న్యూ ఇయర్ జోష్ కనిపించింది. పలు విద్యా సంస్థల విద్యార్థులు గతించిన సంవత్సరంలోని జ్ఞాపకాలను హృదయాంతరాల్లో నిక్షిప్తం చేసుకొని 2022కు వీడ్కోలు పలికారు. కోటి ఆశలతో కొత్త సంవత్సరం 2023కు స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించి కేక్‌లు కట్‌చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇంటి ముందు అలంకరణలకు మార్కెట్‌లో చిరు వ్యాపారులు రంగురంగుల ముగ్గుల పిండి, సుద్దముక్కలు విక్రయించారు. స్వీట్లు, పండ్లు, పువ్వుల దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. వినియోగదారుల అభిరుచి మేరకు బేకరీల యాజమాన్యాలు వారు కోరిన సైజు, ఫ్లేవర్లతో కేక్‌లు అందించారు. ఇక మాంసాహార ప్రియులకు దాబాలు, హోటళ్లు వివిధ రకాల నాన్‌వెజ్ వంటకాలు, బిర్యానీ, కూల్‌డ్రింక్స్ ఆఫర్లపై అందించడానికి సిద్ధం చేశారు. ఉద్యోగులు, రాజకీయ నాయకులు స్వీట్లు, బొకేలు ఆర్డర్లు ఇచ్చి ఆదివారం నాటికి సిద్ధం చేసుకున్నారు. మద్యం ప్రియులు కూడా స్నేహితులతో మజా చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత రోడ్లపై అల్లర్లు జరగకుండా చూసేందుకు తగరపువలస అంబేడ్కర్ కూడలిలోని పోలీస్ అవుట్ పోస్టు దగ్గర ఏఆర్ పోలీసులు విడిది ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వివిధ ప్రార్థనా మందిరాల్లో మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు శనివారం అర్ధరాత్రి కేక్ కటింగ్‌తో ముగిశాయి. ఇందుకోసం చర్చిలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. ఇళ్ల ముందు న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. అన్నివర్గాల ప్రజలు తమ తాహతుకు తగ్గట్టుగా న్యూ ఇయర్‌కు స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.



కేకుల దుకాణం వద్ద వినియోగదారుల సందడి



అంబేడ్కర్ కూడలిలో పోలీసులు ఏర్పాటు చేస్తున్న టెంట్

రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్‌ను తరలించొద్దు



రాయప్పాలెంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆందోళన చేసిన గ్రామస్తులు



రాయప్పాలెంలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన హైస్కూల్ భవన నిర్మాణం

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్‌ను బ్యాంకు కాలనీకి తరలించవద్దని స్థానికులు శనివారం ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాయప్పాలెంలో శిథిలమైన హైస్కూల్ భవనాల కారణంగా తాత్కాలికంగా బ్యాంకు కాలనీకి స్కూల్ తరలించారన్నారు. రాయప్పాలెంలో హైస్కూల్ ఉన్నప్పుడు 11 గ్రామాలైన చిల్లపేట, జీరుపేట, డెక్కతిపాలెం, రాజులింగంపేట, మూలకుద్దు, బ్యాంకు కాలనీ, మరడపాలెం, మామిడిపాలెం నుంచి 250 మంది విద్యార్థులు ఉండేవారన్నారు. 70 ఏళ్ల పైబడి చరిత్ర కలిగిన హైస్కూల్‌ను శాశ్వతంగా వేరేచోటుకు తరలిస్తే ఊరుకునేది లేదన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత రూ.12 లక్షలు నిధులు మంజూరు చేస్తే గతంలో ఉండే రాయప్పాలెంలోనే బేస్‌మెంట్, పిల్లర్ల నిర్మాణం జరిగిందన్నారు. ఇన్ని రూ.లక్షలు ఖర్చు చేసిన పాఠశాలను వృథాగా వదిలేసి ఇప్పుడు బ్యాంకు కాలనీలో వేరే చోట నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయప్పాలెంలో జీవీఎంసీ హైస్కూల్ భవన నిర్మాణం పూర్తయ్యేలా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్, డీఈవోలను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తర్లువాడ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆనందపురం : మండలంలోని తర్లువాడ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఐ.వి.కొండబాబు తెలిపారు. డిసెంబర్ 29న కడప మున్సిపల్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ – 17 విభాగం ఫుట్‌బాల్ పోటీల్లో అశోక్, అండర్ – 14 విభాగం పోటీల్లో ఆదర్శనాయుడు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే డిసెంబర్ 29న విజయవాడలోని రైల్వే స్విమ్మింగ్ పూల్ నందు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ – 17 విభాగం స్విమ్మింగ్ పోటీల్లో తరుణ్, తేజ, అండర్ – 14 విభాగం పోటీల్లో జయవర్ధన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని హెచ్‌ఎం కొండబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు మాధవరావు శనివారం అభినందించారు.

తైక్వాండో పోటీలకు డిగ్రీ విద్యార్థి ఎంపిక



విద్యార్థి హరినాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఆల్ ఇండియా ఇంటర్ కళాశాలల తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఇక్కడ బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న జె.హరినాథ్ డిసెంబర్ 5న ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో ఎంపికయ్యాడు. జనవరి 4న ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడు. ఈ మేరకు కళాశాలలో హరినాథ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల శనివారం అభినందించారు, పోటీలకు ఎంపిక కావడం అందరికీ గర్వకారణమని, విజయం సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విద్యాసాగర్, పీఈటీ డాక్టర్ పి.గౌరీశంకర్, అధ్యాపకులు రాజేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.సహదేవుడు, డి.మాధురి, వై.వెంకటరావు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యత



బీచ్‌లో సేకరించిన చెత్తతో జేసీ విశ్వనాథన్, దివీస్ సిబ్బంది, విద్యార్థులు

భీమునిపట్నం: పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. భీమిలి బీచ్ వద్ద శనివారం ఉదయం నిర్వహించిన సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుద్ధ్యం పాటించకపోతే పరిసరాలు కలుషితం కావడంతోపాటు ఎన్నో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు రోజూ పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త అందివ్వాలని కోరారు. అలాగే బీచ్‌కు నిత్యం ఎంతో మంది సందర్శకులు వస్తుంటారని, ఇక్కడి పరిసరాలను కూడా స్వచ్ఛంగా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, సంచులను వినియోగించకూడదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దివీస్ సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి 420 కిలోల చెత్తను సేకరించారు. ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ శాస్త్రి, జోనల్ కమిషనర్ వెంకటరమణ, దివీస్ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు, రేవిడి యువజన సేవా సంఘం సభ్యులు ఒమ్మి పైడినాయుడు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సహకారం మరువలేనిది



జర్నలిస్టులకు డైరీలు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

మధురవాడ: పోలీసుల విధి నిర్వహణలో జర్నలిస్టుల సహకారం మరువలేనిదని విశాఖ నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ చుక్కా శ్రీనివాసరావు చెప్పారు. మధురవాడ జాతరలో ఎస్‌సీఆర్‌డబ్ల్యూ డైరీలను ఆయన జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా ఇలాగే సహకారం అందించాలని, అంతా కలిసి కార్యక్రమాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అశోక్ కుమార్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు



నరసాపురంలో జగనన్న లే అవుట్ పరిశీలిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ

పద్మనాభం : జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకం ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ సూచించారు. మండలంలోని నరసాపురంలో జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న సిమెంటు పరిశ్రమలో ఇటుకలు సరిపోవని, పైన సిమెంటు ఇటుకలు తీసుకుని గోడలు నిర్మించి శ్లాబులు వేయాలని సూచించారు. రెడ్డిపల్లి జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకం లే అవుట్‌ను గృహ నిర్మాణ శాఖ జిల్లా పీడీ పి.శీనివాస్ పరిశీలించారు. వీరి వెంట డీఈ నీరజ, ఏఈ వెంకటేష్ ఉన్నారు.

బదిలీ అయిన ఈవో శ్రీనివాసరావుకు సన్మానం



కీర్తి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: కశింకోట గ్రూపు టెంపుల్స్‌కు బదిలీ అయిన అనంత పద్మనాభ స్వామి గ్రూపు టెంపుల్ ఈవో కీర్తి శ్రీనివాసరావును శనివారం కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు సన్మానించారు. శ్రీనివాసరావుకు శాలువ కప్పి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, ఆలయ అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి, పవన్ పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



జాతీయ రహదారిపై పరచుకున్న మంచు

ఆనందపురం : మండలంలో శనివారం ఉదయం విపరీతమైన పొగమంచు కురిసింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 7 : 30 గంటల వరకు మంచు కురుస్తూనే ఉండడంతో వాహనాలు అత్యంత సమీపం వరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు చాలా ఇక్కట్లు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించడం కోసం వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. పలు విద్యా సంస్థలు బస్సులను మారుమూల గ్రామాలకు కూడా నడుపుతున్నాయి. దీంతో ఉదయాన్నే బస్సులు బయలుదేరాల్సి రావడంతో డ్రైవర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



రోడ్డు కనిపించకుండా కమ్మేసిన పొగమంచు

మామిడి పూతకు దెబ్బ

పొగమంచు వల్ల మామిడి పూత దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి చెట్లకు ఇప్పుడిప్పుడే పూత పూస్తోంది. ఈ దశలో పొగమంచు కురవడంతో పూత మాడిపోయి రాలిపోతుందని ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లుగా పూత రాకపోవడంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది సకాలంలో పూత వచ్చిందని ఆనందపడినా తరుచూ కురుస్తున్న పొగ మంచు వల్ల మామిడి దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై మంచు దుప్పటి

తగరపువలస: వారం రోజులుగా భీమిలి పరిసరాలను మంచుదుప్పటి కమ్ముకుంటోంది. ఉదయం 8 వరకు మంచు తెరలు వీడటం లేదు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. హెడ్ లైట్లు వేసుకున్నా రహదారులు కనిపించడం లేదు. ఇదిలా ఉండగా పారిశుద్ధ్య కార్మికులు, రైతులు, భవన నిర్మాణ కార్మికులు ఈ మంచును చీల్చుకుంటూనే తమకు ఉపాధి చూపే మార్గాలను వెతుక్కుంటూ వెళ్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి పాఠశాలలకు హాజరవుతున్నారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలను తొమ్మిదో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో ధనుర్మాస పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ పూజలను నిర్వహించారు. పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో, సింహాచలం దేవస్థానానికి చెందిన వెంకన్న ఆలయంలో ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. తిరుప్పావై సేవాకాలాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.